

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

## పారిశుధ్య పనుల పరిశీలన

సిద్దిపేట, మార్చి 21: సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహించొద్దని సూచించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

## రక్తదానం ప్రాణదానంతో సమానం

సిద్దిపేట టౌన్, మార్చి 21: రక్తదానం ప్రాణదానంతో సమానమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ దవాఖాన, జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కళాశాల ఆవరణలో మోగా రక్తదానం శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్ సుదర్శనం, మహేందర్‌రెడ్డి, అయోధ్య రెడ్డి, పల్లవి మధుసూదన్, రాణి, శ్రద్ధానందం, మహేందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

## అంగడికిష్టాపూర్‌లో కోటి తలంబ్రాల దీక్ష

### గోటితో వడ్లు వలిచి భక్తిని చాటుకున్న గ్రామస్తులు



కోటి తలంబ్రాల దీక్ష సందర్భంగా రామకోటి భక్త సమాజాన్ని అభినందిస్తున్న గ్రామస్తులు

మార్కుక్, మార్చి 21: మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్ ఉమామహేశ్వర ఆలయంలో గురువారం రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రాచల శ్రీరాముని కల్యాణ తలంబ్రాలు గోటితో వడ్లు వలిచే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, తాజా మజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్‌లు మాట్లాడుతూ గోటితో వడ్లు వలిచి తిరిగి భద్రాచలం పంపే మహాభాగ్యం తమ గ్రామానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజును అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట నరసింహశర్మ, మాజీ ఉప సర్పంచ్ కొండల్ రెడ్డి, గుడాల అశోక్, బల్లి నాగరాజు, మహేందర్‌రెడ్డి, గడీల తిరుపతి, వెంకటేశ్‌చారీ, తోట సత్యం, సాయిలు, రాజు, గణేశ్ పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 21: కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు బచ్చలి సత్తయ్య ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కాగిత నవనీత, కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బచ్చలి సత్తయ్యతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

## హైనా దాడిలో జీవాల మృత్యువాత

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 21: హైనా దాడిలో జీవాలు మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల కొమురెల్లి ఎప్పటిలాగే తన వ్యవసాయ బావి వద్ద ఉన్న దొడ్డిలో బుధవారం సాయంత్రం జీవాలను తోలి ఇంటికి చేరుకున్నాడు. గురువారం తెల్లవారుజామున దొడ్డి వద్దకు వెళ్లి చూడగా 18 గొర్రెలు మృతి చెందగా, మరో 6 గొర్రెలు తీవ్ర గాయాలతో కనిపించడంతో దొడ్డివద్దనే కొమురెల్లి కుప్పకూలిపోయి కన్నీరుమున్నీరుగా విలపించాడు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ రాముడు, వెటర్నరీ అధికారులు గ్రామాన్ని సందర్శించి జీవాలపై దాడి చేసింది హైనాయేనని నిర్ధారించారు. మృతిచెందిన జీవాలకు పంచనామా నిర్వహించారు. అంతకు ముందు రోజు రాత్రి హైనా దాడిలో కర్రె నర్సయ్యకు చెందిన దుడ్డె మృతిచెందింది. రెండ్రోజులుగా గ్రామంలో హైనా సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. హైనా దాడిలో జీవాలు మృతిచెందడంతో ఆర్థికంగా నష్టపోయిన గొల్ల కొమురెల్లిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య కోరారు.



మృతిచెందిన జీవాలకు పంచనామా నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

- ఉదయం నుంచి క్యూలో నిల్చుంటున్న విద్యుత్ వినియోగదారులు

# జీరో బిల్లుకు మళ్లీ దరఖాస్తు!

గజ్వేల్, మార్చి 21: కరెంట్ 200 యూనిట్లలోపు వాడుకున్న వారికి ఉచితంగా జీరో బిల్లు అందించి ఎలాంటి బిల్లులు వసూలు చేయమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. మార్చిలో చాలా మందికి జీరో కరెంట్ బిల్లులు రాకపోవడంతో వినియోగదారులు షాక్‌కు గురయ్యారు. గజ్వేల్ మున్సిపల్ అధికారులు ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారాలను వంద శాతం ఆన్‌లైన్ చేయకపోవడంతో జీరో బిల్లులు రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కొద్దిరోజులుగా పట్టణానికి చెందిన వినియోగదారులు రోజూ వందల సంఖ్యలో మున్సిపల్ కార్యాలయంలో తిరిగి దరఖాస్తులు అందజేస్తున్నారు. త్వరగా ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నారు.



గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు



బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

ములుగు, మార్చి 21: గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌కు చెందిన మున్సిపల్ కార్మికుడు సల్ల స్వామి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా గురువారం మండల కేంద్రం ములుగులో డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సల్ల నరేశ్ ఉన్నారు.

## డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలి

చేర్యాల, మార్చి 21: మండల కేంద్రం నుంచి శభాష్‌గూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. నిత్యం ఈ రోడ్డు వెంబడి ప్రయాణికులు కొమురవెల్లి, కొండపోచమ్మ, యాదగిరిగుట్టతో పాటు హైదరాబాద్ నగరానికి వెళ్తుంటారని, సింగిల్ రోడ్డు మీద ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. డబుల్ రోడ్డు నిర్మాణంతో కడవేరుగు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, నాగపురి, శభాష్‌గూడెం ప్రజలతో పాటు ప్రయాణికులకు ఇబ్బందులు తొలిగిపోతాయన్నారు. ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించడంతో ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, కడవేరుగు ఎంపీటీసీ గదరాజు యాదగిరి, నాగపురి మాజీ సర్పంచ్ కరుణాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గదరాజు చందు, జింకల పర్వాతాలుయాదవ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



చేర్యాల: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు



కొమురవెల్లి: బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లా

**బాధిత కుటుంబానికి పరామర్శ**

కొమురవెల్లి, మార్చి 21: మండలంలోని లెనిన్‌నగర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి మచ్చేందర్ తండ్రి యాదయ్య ఇటీవల మృతిచెందగా గురువారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పటంతోపాటు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, చేర్యాల ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, శ్రీధర్‌రెడ్డి, చేర్యాల మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రాజేశ్ ఉన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత

రాయపోల్, మార్చి 21: పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని గజ్వేల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మండల స్థాయి పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత నివారణకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ ఆకు కూరలతో పాటు గుడ్లు, చేపలు వంటివి ఆహారంగా తీసుకోవాలన్నారు. బాలికల్లో రక్తహీనతను నివారించడానికి ఆకుకూరలు ఎంతో ఉపయోపగపడుతాయన్నారు. 'సరైన పోషణ, ఆరోగ్య తెలంగాణ, పోషణ లోపం ఏ గ్రామంలో కనిపించకూడదు' అనే అంశంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షబానా, పీహెచ్‌సీ వైద్యాధికారి బల్ల మహరాజ్, ఎస్ఐ రఘుపతి, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ వినోద, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కిరణ్ పాండే, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కేజీబీవీ ఎస్‌వో సుగంధలత, ఏఈవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**మద్దూరులో పోషణ పక్షోత్సవాలు**

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 21: మద్దూరు మండల కేంద్రంలోని జాగృతి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఎంపీడీవో రామ్మోహన్ మాట్లాడుతూ చిరుధాన్యాలలోనే ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం పోషకాహారం, చిరుధాన్యాల ప్రాధాన్యంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, సీబీవో ఆడిటర్ ప్రసాద్, సీసీలు సిద్ధిమల్లయ్య, ప్రేమలత, మహేందర్, నర్సయ్య, మండల సమాఖ్య అధ్యక్ష-కార్యదర్శులు నవనిత, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు యాకమ్మ, దుర్గలత, మౌనిక, భాగ్యమ్మ పాల్గొన్నారు.



రాయపోల్: వంటకాల స్టాల్‌ను పరిశీలిస్తున్న సీడీపీవో సరిత, మండల అధికారులు

**ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం**

మిరుదొడ్డి మార్చి 21: ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామ్‌సన్ అన్నారు. గురువారం చెప్యాలా గ్రామంలో పోషణ పక్షోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణిలు, బాలింతలకు పోషకాహారం అవగాహన కల్పించారు.

## అక్రమ వెంచర్‌ను తొలిగించాలి

మిరుదొడ్డి, మార్చి 21: అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌ను వెంటనే తొలగించాలని ఎంపీటీసీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధర్మారం గ్రామంలో వేసిన వెంచర్‌ను తొలిగించాలని గురువారం ఎంపీడీవో గణేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా వేసిన వెంచర్ నిర్మాణాలను తొలిగించి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

బెజ్జంకి, మార్చి 21: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఉన్నత చదువులు, ఉద్యోగ సాధన, అసాంఘిక కార్యక్రమాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్జీత్‌కౌర్, మధుసుదన్‌రెడ్డి, శంకరచారీ, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

కొమురవెల్లి, మార్చి 21: 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ అమరేందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఓటుతో దేశ ప్రగతినే మార్చగలమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

## పారిశుధ్య పనుల పరిశీలన

సిద్దిపేట, మార్చి 21: సిద్దిపేటలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు.

## కార్యవర్గం ఎన్నిక

రాయపోల్, మార్చి 21: బీజేపీ రాయపోల్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజాగౌడ్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, ఓబీసీ మోర్చ అధ్యక్షులుగా స్వామి, కిసాన్ మోర్చ అధ్యక్షులుగా కొంగరి స్వామి, ఎస్సీ మోర్చ అధ్యక్షులుగా టేంకంపేట నర్సింలు, మండల కార్యవర్గ సభ్యులుగా శ్యామ్‌రావు, వీరాచారి, మహేశ్, అశోక్‌లను ఎనుక్కుకున్నారు. సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, పార్లమెంట్ ఇన్‌చార్జి స్వామి, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, రాయపోల్ మాజీ సర్పంచ్ స్వామి, నాయకులు తిరుపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీను, గణేశ్, కనుకయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

హుస్నాబాద్ టౌన్, మార్చి 21: సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ కోరారు. పట్టణంలో గురువారం ఆస్తిపన్ను వసూళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పలువురితో మాట్లాడుతూ పన్నులు చెల్లిస్తే ప్రగతి సాగుతుందన్నారు. వందశాతం పన్నులు చెల్లించి పట్టణాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలో ఇప్పటివరకు 77.36శాతం పన్నుల వసూలు పూర్తయిందని తెలిపారు. అనంతరం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను సందర్శించి దుకాణాల నిర్వహణ తీరును పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఇన్‌చార్జి ఆర్ఐ జాలింగం శంకర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు

హుస్నాబాద్, మార్చి 21: హుస్నాబాద్ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు వరించాయి. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి వారికి గురువారం డిపో మేనేజర్ వెంకటేశ్వర్ అవార్డులు అందజేశారు. విధులను సక్రమంగా నిర్వహించిన డ్రైవర్, కండక్టర్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్ల పని తీరుతోనే ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని, హుస్నాబాద్ డిపోకు ఆదాయం పెంచడంలో వీరి పాత్ర కీలకమన్నారు. డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్, మెకానిక్ సూపరింటెండెంట్లు నర్సయ్య, సామ్యూల్, అకౌంటెంట్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



ప్రగతిచక్ర అవార్డు పొందిన ఉద్యోగులతో డిపో మేనేజర్

## ఇందూర్ కాలేజీలో వరల్డ్ హ్యాపీనెస్ డే

సిద్దిపేట అర్బన్, మార్చి 21: సిద్దిపేటలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వరల్డ్ హ్యాపీనెస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, ట్రైనర్ సద్ది రమాదేవి, బోయని సంపత్‌కుమార్ సంతోషం, ఆనందం అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మనిషి జీవితం అద్భుతమని, ఆనందాన్ని వెతకడంలో చాలామంది సతమతమవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీపీ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇందూరు ఇంజినీరింగ్ విద్యార్థులతో ట్రైనర్లు

## పాడి గేదెలకు విషం..

### రూ.2లక్షల విలువైన రెండు బర్రెలు మృతి

అక్కన్నపేట, మార్చి 21: మూగ జీవాలని కనికరం లేకుండా విష గుళికలు పెట్టి చంపేశారు. సుమారు రూ. 2 లక్షల విలువ చేసే రెండు పాడిగేదెలు చనిపోవడంతో బాధిత కుటుంబం కన్నీటిపర్యంతం అయిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేటకు చెందిన మట్టెల కనకయ్య రెండు పాడిగేదెల మీద ఆధారపడి జీవిస్తున్నాడు. ఊరు సమీపంలోని తన వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కుడిదిలో విష గుళికలు కలిపారు. ఇది గమనించని కనకయ్య ఉదయం 10 గంటలకు గేదెలకు కుడిది పెట్టి చెట్ల కింద కట్టివేసి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూసేసరికి అవి ప్రాణాలు కోల్పోయి కన్పించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. అనంతరం పశువైద్యాధికారులు వచ్చి అక్కడే పోస్టుమార్టం చేసి పంచనామా నిర్వహించారు. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఎంపీటీసీ పెసరు సాంబరాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు తొందూరి ఎల్లయ్య, స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విష గుళికలు పెట్టి చంపిన వారిని గుర్తించి, శిక్షించాలని డిమాండ్ చేశారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సింగిల్ విండో చైర్మన్, మాజీ సర్పంచ్ తదితరులు

## జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



లింగారెడ్డిపల్లెలో ఈజీఎస్ పనులను పరిశీలిస్తున్న పీడీ జయదేవ్



ధర్మారంలో ఉపాధి హామీ పనులను పరిశీస్తున్న ఎంపీడీవో గణేశ్‌రెడ్డి

జగదేవ్‌పూర్ మార్చి 21: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని డీఆర్‌డీవో పీడీ జయదేవ్ అన్నారు. గురువారం మండలంలోని లింగారెడ్డిపల్లి, పీర్లపల్లి రాయవరం, పీటీ వెంకటాపూర్ తదితర గ్రామాల్లో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మలతో కలిసి పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం మండల కార్యాలయంలో ఈజీఎస్ టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించి పేమెంట్స్ వేగంగా పూర్తి చేయాలన్నారు. ల్యాండ్ లెవలింగ్ ఫామ్‌పాండ్స్ వంటి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మి, టీఏలు తిరుపతిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాజు, ఈసీ చారి, సీవోలు సంయొద్దీన్, నాగరాజు, పంచాయతి కార్యదర్శులు హరిప్రసాద్ వేణు, నాగరాజు తదితరులు ఉన్నారు.

**కూలీలకు ఇబ్బందులు రాకుండా చర్యలు**

మిరుదొడ్డి, మార్చి 21: ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం ధర్మారంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా లెవలింగ్ పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కూలీల డబ్బులు చెల్లించాలి**

మిరుదొడ్డి(అక్బర్‌పేట-భూంపల్లి), మార్చి 21: ఉపాధి హామీ కూలీల డబ్బులు చెల్లించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ అన్నారు. గురువారం భూంపల్లిలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు 2 నెలల నుంచి కూలీ డబ్బులు ఇవ్వడం లేదన్నారు.

# హెర్బల్ న్యూట్రీషన్ క్లబ్‌లో మోసం!

### మహిళ ఆత్మహత్యాయత్నం.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సిద్దిపేట టౌన్, మార్చి 21: హెర్బల్ ప్రోడక్ట్స్ అమ్మి ఆదాయం పొందొచ్చని నిండా ముంచుతున్న ఘటనలు కోకొల్లలు. తాజాగా హెర్బల్ ప్రోడక్ట్స్ నిర్వాహకుల చేతిలో ఓ మహిళ మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాధితులు భారత్‌నగర్‌లోని హెర్బల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. బాధితురాలు స్వప్న భర్త రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుప్రీమ్ న్యూట్రిషన్ పేరుతో మాధవ్ అలియాస్ ముదాసర్, రాజు, మనిషా హెర్బల్ సెంటర్ ఏర్పాటు చేశారు. తమ సంస్థలో చేరి గొప్ప జీవన విధానం పాటించడంతో పాటు, హెర్బల్ ప్రోడక్ట్స్ తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని ప్రచారం చేశారు. నమ్మిన తన భార్య స్వప్న హెర్బల్ న్యూట్రీషన్ సెంటర్లో చేరింది. నెలపాటు నిర్వాహకులు సూచించినట్లుగా ప్రోడక్ట్స్ వాడి మానివేసింది. ఈ సమయంలో స్వప్నకు హెర్బల్ నిర్వాహకులు మాయమాటలు చెప్పి ప్రోడక్ట్స్ అమ్మి అదనపు అదాయం సంపాదించుకోవచ్చని, స్వయంగా సెంటర్ ఏర్పాటు చేసుకోవచ్చని నమ్మించారు. దీంతో బాధితురాలు రూ.లక్ష విలువగల వస్తువులను కొనుగోలు చేసింది. సెంటరు ఏర్పాటు కోసం మరో రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టింది. కాగా, నిర్వాహకులు వస్తువులు ఇవ్వకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి.. నెల రోజుల కిత్రం ఆత్మహత్యాయత్నం చేసింది. స్వప్న ఆత్మహత్యకు గల కారణాలు తెలిపే లేఖ బయటపడడంతో కుటుంబ సభ్యులు న్యూట్రీషన్ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యూట్రీషన్ నిర్వాహకులను స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



న్యూట్రీషన్ సెంటర్ నిర్వాహకులతో ఘర్షణ పడుతున్న బాధితులు

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త సిద్దిపేట జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ సింగిరెడ్డి రాజిరెడ్డి, తండ్రి: చంద్రారెడ్డి, వయస్సు: 65 సంలు, ఇంటి నెం.10-2-920, గ్రా|| విద్యానగర్, కరీంనగర్ ప్రస్తుత నివాసం మెట్‌పల్లి గ్రామము, చిన్నకోడూర్ మండలము, జిల్లా: సిద్దిపేట గారి తరుపున తెలియజేయునది ఏమనగా, లోగడ గత 40 సం||ల క్రితం నుండి నా క్లయింట్ సింగిరెడ్డి రాజిరెడ్డి మరియు ఆయన భార్య శ్రీమతి సింగిరెడ్డి మధుర అలియాస్ కుంట మధుర, తండ్రి: సత్యారెడ్డి గారలు కరీంనగర్ లో జీవిస్తున్నారు. గత 30 సంల నుండి ప్రైవేటు స్కూల్ లావాదేవీలలో డబ్బులు ఇతరుల నుండి తీసుకొనుట మరియు తిరిగి చెల్లించుటకు సంబంధించిన వివిధ రకాల పత్రాలు నా క్లయింట్ సంతకము చేసినవి మరియు ఆతని భార్య మధుర గారు సంతకములు చేసిన చెక్కులు, ప్రామిసరి నోట్లు మరియు తెల్ల కాగితములపై సంతకములు చేసిన డాక్యుమెంట్స్ నా క్లయింట్ భార్య అయిన శ్రీమతి మధుర గారి దగ్గరనే యున్నవి. వీరిద్దరి మధ్య గత 13 సం||ల నుండి కుటుంబ తగాదాలు వచ్చినందున కొన్ని కేసులు కరీంనగర్ కోర్టులలో విచారణలో గలవు. ఇట్టి కారణాల చేత నాక్లయింటు పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడి అతనిని సమాజ ములో అవమానములకు గురిచేయుచు, ఖాళీ ప్రామిసరి నోటులు మరియు చెక్కులలో నా క్లయింట్ సంతకములు చేసియున్నందున ఆమె కొంత మంది దగ్గరి స్నేహితులు, కుమారులు, బంధువుల ద్వారా తప్పుడు కేసులు వేయుటకు ప్రయత్నించుచున్నదని తెలియుచున్నది. కావున శ్రీమతి మధుర గారు భవిష్యత్తులో వేయు తప్పుడు కేసులు మరియు అక్రమ కేసులకు, ఎవరూ కూడా సహకరించరాదని, అతిక్రమించినచో అందరిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోగలమని ఇట్టి ప్రకటన ద్వారా హెచ్చరించనైనది.

సం/- పి.లక్ష్మణ్ రాజు, న్యాయవాది
ఇంటి నెం.3-7-229/1, వావిలాలపల్లి,
కరీంనగర్ సెల్: 9849405116